



రంగయ్యపల్లిలో కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

- సన్న, దొడ్డు రకాలకు బోనస్ చెల్లించాలి
- రైస్‌మిల్లర్లతో కొంత మంది నాయకుల ములాఖత్
- రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- సర్వేకు వచ్చిన అధికారులను నిలదీస్తున్న ప్రజలు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

6

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిర్ల క్ష్యం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. భీమదేవర పల్లిలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే సన్న, దొడ్డు వడ్ల కు బోనస్ ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ హామీల గురించి కుటుంబ సర్వేలో అధికారులను ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు.

- భీమదేవరపల్లి

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలి..
- బీసీ డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ విఫలం
- ఒక్క బీసీకైనా రూ.10లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చారా..?
- మండలానికో బీసీ గురుకులం, జిల్లాకో డిగ్రీ కాలేజీలు ఏమయ్యాయి..
- కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై వారోత్సవాలు నిర్వహిస్తాం..
- సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

6



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

కేటీఆర్ రాక సందర్భంగా నగరంలో బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేద న్నారు. అలాగే కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. కుల గణనకు తాము వ్యతిరేకం కాదని, తమిళ నాడు తరహాలో రిజర్వేషన్లు ఇక్కడ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కేటీఆర్ నగర పర్యటన సందర్భంగా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కరుణాపురం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కన్నుల పండువగా లక్ష మహాదీపోత్సవం



మానుకోటలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో లక్ష మహాదీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

8

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

- సీసీఐ, మార్కెట్‌లలో నిరవధికంగా నిలిపివేత
- తెలంగాణ కాటన్ అసోసియేషన్ నిర్ణయం
- సరుకును యార్డులకు తీసుకురావొద్దు : మార్కెటింగ్‌శాఖ అధికారులు



మహబూబాబాద్ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు (ఫైల్)

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లలో కఠిన నిబంధనలు విధించడంతో రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ పత్తి కొనుగోళ్లను, ప్రైవేట్ పరంగా మార్కెట్ యార్డులలోనూ నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు తెలం గాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. దీంతో సోమవారం నుంచి మహబూబాబాద్ జిల్లాలో ఖరీదులు బంద్ కానున్నాయి. దాని ఫలితంగా కేస ముద్రం, మహబూబాబాద్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోని కాటన్ మిల్లుల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఖరీ దులు బంద్ చేస్తున్నట్లు వ్యాపారులు ప్రకటించడంతో కేసముద్రం, మహబూబా బాద్, తొర్రూరు మార్కెట్ కమిటీల కార్యదర్శులు అమరలింగేశ్వర్‌రావు, శంషీర్, నిరంజన్ ఆదివారం సాయంత్రం పై విషయాన్ని ప్రకటించారు. రైతులు మార్కెట్ యార్డులకు, మిల్లులకు పత్తిని తీసుకువచ్చి ఇబ్బందులకు గురికావొద్దని మార్కెట్ కార్యదర్శులు కోరారు. పత్తి వ్యాపారులు మళ్లీ కొనుగోళ్లు చేసే తేదీని ప్రకటించేంత వరకు మార్కెట్‌లకు పత్తిని తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు. పత్తిలో ఎల్-1, ఎల్-2, ఎల్-3 రకం పత్తిని కొనుగోళ్లలో మిల్లులకు, రైతులకు సీసీఐ సంస్థ కఠిన నిబంధనలు విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మహబూ బాబాద్ జిల్లాలోని కాటన్ జిన్నింగ్ మిల్లుల యాజమానులు తెలిపారు. అయితే మిల్లుల గేట్‌లకు తాళంవేసి వెళ్తున్నందున సీసీఐ అధికారులు కూడా ఖరీదులు చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో సోమవారం నుంచి నిరవధికంగా పత్తి ని ఖరీదులు చేపట్టడం లేదు. నిన్నమొన్నటి వరకు తేమసాకుతో పత్తి కొనుగో ళ్లను చేపట్టని సీసీఐ సంస్థ గత రెండ్రోజుల క్రితం నుంచే పత్తి కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడే అవకాశం ఏర్పడింది.

ఏకశిల పదునెట్టాంబడి ఆలయ విశిష్టతలెన్నో..



కేసముద్రంలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి దేవాలయం



ఆలయ విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న శబరిమల ప్రధాన తంత్రి మహేష్‌మోహన్‌తంత్రి (ఫైల్)

- రాష్ట్రంలో ఏకశిలతో 18 మెట్లున్న రెండో అయ్యప్ప ఆలయం
- శబరిమల తర్వాత 'శ్రీయంత్రం'పై పదునెట్టాంబడి
- శబరిమలలో మాదిరిగా ఉత్తర నక్షత్రం రోజున పడిపూజ
- రూ.2.20 కోట్ల విరాళాలతో నిర్మాణం
- నిత్య గణపతి హోమం, 2వేల మంది మాలధారణలు
- ఈ నెల 16 నుంచి వచ్చే నెల 27 వరకు మండల మహోత్సవాలు

కేసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివారి ముందు నిర్మించే 18 మెట్ల (పదునెట్టాంబడి)కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. నియమ నిష్ఠలతో అయ్యప్ప దీక్ష చేపట్టి ఇరుముడి ధరించిన వారు మాత్రమే ఈ మెట్లపై వెళ్లేందుకు అర్హులు. అంత పవిత్రంగా భావించే మెట్లను ఒకే రాయితో తయారు చేసి ఏర్పాటు చేయడంతో మరింత విశిష్ట తగా అయ్యప్పభక్తులు భావిస్తున్నారు. అలాంటి ఏకశిల పదునెట్టాంబడి కేసముద్రం మండల కేంద్రం లో నిర్మించిన శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో ఉండడం విశేషం. 2022లో ప్రారం భించిన ఈ ఆలయం లో తొలి ఏడాదిలోనే అత్యంత ప్రాచుర్యం పొందింది. అదే ఏడాది అక్టోబర్ 7న మాలధారణ లు ప్రారంభమై ఇప్పటి వరకు కేస ముద్రం, ఇనుగుర్తి, గూడూరు, నెక్కొండ మండలా లకు చెందిన రెండువేల మంది అయ్యప్పమాలను ఆలయంలో ధరించి దీక్షను చేపట్టారు.

2019లో శంకుస్థాపన..

కేసముద్రం అయ్యప్పదేవాలయం నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 6న శంకుస్థాపనను మహబూబా బాద్ అయ్యప్పదేవాలయం ప్రధాన తంత్రి సంజీవ నంబూద్రి పూజా కార్యక్రమాలతో నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అధ్యక్షునిగా వేలం చంద్రశే ఖర్, ప్రధాన కార్యదర్శిగా పోలెపల్లి యాకూబ్‌రెడ్డి, కోశాధికారిగా బోగోజు నాగేశ్వరాచారిలు వ్యవహ రిస్తూ కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, దాతల సహకారంతో మూడే ళ్లపాటు నిర్మాణం కొనసాగింది. 2022, ఫిబ్రవరి 7న రథసప్తమి రోజు శబరిమల ప్రధాన తంత్రి మహేష్‌మోహన్‌తంత్రి, మాజీ మేల్‌శాంతి మనోజ్ నంభూద్రి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వ హించారు.

ఆలయ విశేషాలెన్నో..

అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణంలో ఏకశిల పదునెట్టాంబడి (18 మెట్ల)ని ప్రతిష్ఠించడం ఒక విశేషం. ఇలా ఏకశిల పదునెట్టాంబడితో ఆలయం రాష్ట్రంలో నిజామాబాద్ తర్వాత కేసముద్రంలో కావడం గమనార్హం. శబరిమల దేవస్థానం తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ఆలయంలో శ్రీయంత్రంపై పదునెట్టాంబడిని ప్రతిష్ఠించడం ప్రత్యేకతను సంతరించుకుంది. శబ రిమల దేవాలయం మాదిరిగా అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ప్రతీ ఉత్తరా నక్షత్రానికి పడి పూజ నిర్వహిస్తున్న ఏకైక దేవాలయం ఇదే. కేరళ నుంచి వచ్చిన ఆలయ ప్రధాన తంత్రి విష్ణు నారాయణపొట్టి ఆధ్వ ర్యంలో ప్రతీరోజు ఉదయం నిత్య గణపతి హోమం, ప్రతీ బుధ వారం స్వామి వారి ఉదయం అభిషేకం, సాయం త్రం భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న అయ్యప్ప అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా దీక్షల సమయంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27 వరకు మండల మహోత్సవాలు నిర్వహించనుండగా 45 రోజులపాటు నిత్యాన్న దానం చేయనున్నారు. డిసెంబర్ 27న కేసముద్రం విలేజి చెరువు వద్ద మధ్యాహ్నం పంబారట్టు, రాత్రి అగ్నిగుం డం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గత ఏడాది ఆలయ పదునెట్టాంబడి, ధ్వజస్తంభానికి ప్రత్యే క విరాళాలను సేకరించి రూ.18లక్షల వ్యయంతో పంచలోహంతో తాప డం చేయిం చారు. ఏదేమైనా మూడేళ్లలోనే రూ.2.20కోట్ల విరాళాలతో ఎన్నో విశేషాలతో ఇక్కడ అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణం చేయ డం, అనతికాలంలోనే ప్రాచుర్యంపొంది, రెండు వార్షికో త్సవాలు పూర్తి చేసుకుంటుండడంతో అంతా స్వామివారి మహిమేనని భక్తులు భావిస్తున్నారు.

ఈ ఆలయంతో మంచి పేరు వచ్చింది

విష్ణునారాయణపొట్టి, కేసముద్రం అయ్యప్ప దేవాలయ ప్రధాన తంత్రి



కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని వివిధ అయ్యప్పదేవాయాల్లో పనిచేశాను. ఇక్కడి ఆలయానికి వచ్చిన కొద్దిరోజులకే మంచి అను భూతి కలిగింది. కేసముద్రం శ్రీధర్మశాస్త దేవాలయంతోనే మంచి పేరుతో పాటు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డులో తాంత్రిగా పనిచేసే అవకాశం వచ్చింది. మహిమాన్వితమైన ఆలయం ఇది.

తక్కువ కాలంలోనే గుర్తింపు పొందింది

బోగోజు నాగేశ్వరాచారి, ఆలయ కమిటీ బాధ్యుడు



ఉమ్మడి వరంగల్‌జిల్లాలో ఇంతటి సుందరమైన దేవా లయం ఎక్కడా లేదు. ఈ దేవాలయం కోసం పనిచేయడం మా అదృష్టంగా భావిస్తు న్నాం. మూడేళ్లలోనేఆలయానికి అయ్యప్పస్వామి భక్తుల రాక పెరిగింది. తక్కువ కాలంలోనే ఆలయానికి గుర్తింపు వచ్చింది.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్



మహబూబాబాద్ కంకరబోడ్ ప్రాంతంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ పట్టణం లోని కంకరబోడ్ ప్రాంతంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేలో సిబ్బందికి ప్రజ లు సహకరిస్తూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఎన్యుమరేటర్లు సమాచారం సేకరించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్ద న్నారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, ప్రత్యేకాధికారులు నిరం తరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసి పల్ కమిషనర్ నోముల రవీందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

మహబూబాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నేపథ్యంలో సోమవారం (నేడు) కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సంద ర్భంగా సోమవారం జరిగే గ్రీవెన్స్‌ను రద్దు చేయడం జరిగిందని, ప్రజలు గమ నించి సహకరించాలన్నారు.



నిట్‌లో ఆదివారం రాత్రి జరిగిన డీజే నైట్‌లో విద్యార్థుల జోష్

వండర్ కాస్మిక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజ్ఞానమే హద్దుగా..

- నిట్‌లో ఆలోచింపచేసిన విద్యార్థుల ప్రదర్శనలు
- ముగిసిన టెక్నోజియాన్ - 24 వేడుక
- రెండు రోజుల్లో 30కి పైగా ఎగ్జిబిట్ల ప్రదర్శన
- చివరి రోజూ కొనసాగిన పలు ఈవెంట్లు
- తిరుగుముఖం పట్టిన విద్యార్థులు

7

ఆలోచింప చేసే ఆవిష్కరణలు, విజ్ఞానం పెంచే విషయాలతో విద్యార్థులు అదరగొట్టారు. రెండు రోజులుగా వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల (నిట్)లో జరుగుతున్న టెక్నోజియాన్ - 24 ఆదివారం ముగిసింది. విద్యార్థులు 30కి పైగా ఈవెంట్లు ప్రదర్శించారు. విద్యార్థులనుద్దేశించి పలువురు అతిథులు ప్రసంగించారు. చివరి రోజు కూడా ఈవెంట్లు కొనసాగాయి. సెల్యూషన్, ప్రాడక్ట్ లాంచ్, లాబ్రింత్, మెకానికల్ కిట్, వండర్ కాస్మిక్, కమాండ్ బేస్డ్ కంట్రోల్, చాకోలెట్ డిస్పెన్సర్, రివర్ క్లీనింగ్ బోట్ ఈవెంట్లు ఆలోచింపజేశాయి. కాగా, ఈ వేడుక విదేశీయులను ఆకట్టుకుంది. సిరియాకు చెందిన ముదార్.. తన ఇద్దరు పిల్లలతో టెక్నోజియాన్‌కు వచ్చారు. ఈయన నిట్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలి

- బీసీ డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ విఫలం
- కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై వారోత్సవాలు నిర్వహిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

వరంగల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారని, అయితే ఈలోగా కులగణను పూర్తి చేసి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది కాంగ్రెస్‌పార్టీ కామా రెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిందని, వాటిలో ఏఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు.

ఆరు నెలల్లో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి, ఏడాది దాటినా అమలు చేయడం లేదన్నారు. 42శాతం రిజ ర్వేషన్లు అమలు చేయాలని ఇంటింటికి వచ్చే అధికా రులను, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీయా లని కేటీఆర్ పిలుపునిచ్చారు. కులగణనను తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని, కచ్చి తంగా కులగణన చేయాల్సిందేనని అన్నారు. తమ పార్టీ బృందం తమిళనాడులో అమల వుతున్న 60శాతం రిజర్వేషన్లను అధ్యయనం చేసిందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తమి ళనాడు తరహాలో ఇక్కడ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లలో కాంగ్రెస్ బీసీల కోసం కేంద్రంలో మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. బీసీ కుల గణన పైన, ప్రభుత్వంపైన ప్రజలకు నమ్మకం లేదని, అందుకే ఇంటింటికి వెళ్తున్న అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలల్లో ప్రతీ మం డలానికి గురుకులం ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఒక్క బీసీకైనా వడ్డీ లేని రూ.10లక్షల రుణం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. తొలి ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.8వేల కోట్లే ప్రకటించిందని, అవికూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదని విమర్శించారు. కాంట్రాక్టుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేస్తోందా? అని ప్రశ్నించారు. 33 జిల్లాల్లో ఒక్కొక్క చోట రూ.50కోట్లతో బీసీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఏడాదికాలంలో ఒక్క బీసీ కన్వెన్షన్ హాల్ నిర్మించారా? అని ప్రశ్నించారు.

ప్రొఫెసర్ జయశంకర్ పేరిట బీసీ ఐక్యత భవనాలు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. చేతివృత్తుల వారికి 50ఏళ్లకే పింఛన్ అని ఇచ్చిన మాట తప్పారని, 2వేల పింఛన్‌ను రూ.4వేల చేస్తామని చెప్పి మాట కూడా నిలపెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. ముదిరాజ్ కులస్థులను బీసీడీ నుంచి బీసీ ఏలో చేరుస్తా మని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వంద రోజుల్లో గొల్లకురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చెప్పి కాం గ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. గౌడ కులస్థులకు ఈత చెట్ల పెంపకం కోసం ప్రతీ ఊరిలో ఐదెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఆందోళన చేస్తుంటే దుర్మార్గంగా అరెస్టులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్ పేరిట బలహీనవర్గాలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్.. ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

దళిత బంధు నిధులు ఇవ్వాలని అడిగితే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక భరోసా కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడు తున్నారని, అబద్ధాల సీఎంను బీఆర్ఎస్ తరుపున అడుగుతూనే ఉంటాం.. నిలదీస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్‌పైనా ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. బీఆర్ఎస్ చేసిన పనులు కాంగ్రెస్ చేసినట్లు చెప్పుకుంటే, ప్రజలు బట్టలు ఊడతీసి కొడతారని అన్నారు. ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవాలకు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై తాము వారోత్సావాలను నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ శాసనమండలి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమ ణారెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, రాష్ట్ర, జిల్లా నాయకులు సుందర్‌రాజన్, వాసుదేవారెడ్డి, జోరిక రమేష్, సిరిమిల్ల సదా నందం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గులాబీ బైక్ ర్యాలీ

బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్ నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం కరుణాపురం వద్ద జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి వందలాది బైక్‌లతో కేటీఆర్‌కు కార్యకర్తలు స్వాగతం పలికారు. మడికొండ, కాజీపేట, నిట్ క్యాంపస్, కాళోజీ జంక్షన్ నుంచి బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దారిపొడువునా కాన్వాయ్ నుంచే కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు చేతులు ఊపుతూ, నమస్కారాలు చేస్తూ వచ్చారు. సాయంత్రం 5గంటలకు బీఆర్ఎస్ కార్యాలయం నుంచి బయలుదేరి వరంగల్‌లో ఓ ప్రైవేటు అస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

- సన్న, దొడ్డు రకాలకు బోనస్ చెల్లించాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



రంగయ్యపల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

భీమదేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రాష్ట్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మం త్రి బండి సంజయ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్య క్తం చేశారు. భీమదేవరపల్లి మండలం రంగ య్యపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఇటీవల పిడుగుపడి రూ.లక్షలు నష్టపోయిన ఎర్రబొజ్జు రాధిక, ఆమె కుమారుడు అరుణ్‌ల ఇంటిని బండిసంజయ్ పరిశీలించారు. అనంతరం ఆయ న విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో జాప్యం చేస్తోం దని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సన్న, దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు సన్నవడ్లకు బోనస్ ఇస్తామని తూతూ మాత్రంగా నిర్వహిస్తోందని విమర్శించారు. కొందరు నాయకులు రైస్‌మిల్లర్లతో ములాఖత్ అయి వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేస్తు న్నారన్నారు. దీంతో రైతులు అడ్డికి పావుశేరు తమ ధాన్యాన్ని మిల్లర్లకు రూ.2వేల లోపు అమ్ముకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 6వేల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందంటున్నారు. మరో 1700 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వెంటనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వంపై రైతులతో ఆందోళన చేస్తామన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో చేస్తున్న కులగణన సర్వేకు బీజేపీ వ్యతిరేకం కాదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కానీ గతంలో కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారన్నారు. దేశ, విదేశాల్లో నుంచి ప్రజలు వచ్చి తమ కుటుంబ సర్వేలో పాల్గొన్నారన్నారు. అందులో ప్రజల కులాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచారన్నారు. ఒకవేళ సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ప్రస్తుత రాష్ట్రప్రభుత్వానికి ఇవ్వకపోతే ఆ సర్వేకు అయిన ఖర్చును మొత్తం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ముక్కు పిండి వసూలు చేయాలన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే కోసం వచ్చిన అధికారులను ప్రజలు అడ్డుకుంటున్నారన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, ఆసరా, వికలాంగుల పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల అమలు, తదితర పథకాలపై ప్రజలు సర్వేకు వచ్చిన అధికారులను అడుగుతు న్నారన్నారు. దీంతో తమకు ఏం తెలియదంటూ సర్వేకు వచ్చిన అధికా రులు వాపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని కల సమయంలో అడ్డగోలు హామీలు ఇచ్చిందన్నారు. కానీ ఆ హామీలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దీంతో యువత, మహి ళా, రైతాంగం, నిరుద్యోగులు అందరూ రాష్ట్రప్రభుత్వంపై ప్రజా వ్యతిరే కతతో ఉన్నారన్నారు.

అంతకుముందు రంగయ్యపల్లి గ్రామంలో బండి సంజయ్ బీజేపీ జెం డాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంగాడి మోహన్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్, లక్కిరెడ్డి తిరుమల, దొంగల కొం రయ్య, మాచర్ల కుమార్, గుండెల్లి సదానం దంయాదవ్, అంబీరు కవిత, సింగం రాజేందర్, మేకల రాజు, వికాస్, వీరన్న, శ్రీనాథ్, అయిలయ్య, అజయ్, రాము, శ్రీకాంత్, సంజయ్, అఖిల్, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన జస్టిస్ సుజయ్‌పాల్

వెంకటాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ దంపతులు ఆదివారం సందర్శించారు. ములుగు జిల్లా జడ్జి ఎస్‌వీపీ.సూర్యచంద్రకళ, సీనియర్ సివిల్ జడ్జి కన్హయ్యలాల్, అదనపు సివిల్ జడ్జి జె.సౌఖ్య, ఎస్పీ శబరీశ్ ఆయన ఘనంగా స్వాగతం పలికారు.



రామప్ప ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న జస్టిస్ సుజయ్‌పాల్

అర్చకులు కోమళ్లపల్లి హరీశ్‌శర్మ, మోహనమఠం ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహామండపంలో జస్టిస్ సుజయ్‌పాల్ దంపతులను శాలువాలతో సన్మానించి మహాశీర్వాదం అందజేశారు. ఆలయ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ వివరించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ రామప్ప దేవాలయం మహా అద్భుత కట్టడమని కొనియాడారు. 800సంవత్సరాల క్రితమే అత్యద్భుతమైన టెక్నాలజీతో నిర్మించడం, నీటిలో తేలియాడే ఇటుకలు, సాంగ్‌బాక్స్ టెక్నాలజీ, గర్భగుడిలోని లైటింగ్, ప్రతిదీ అత్యద్భుతమని అన్నారు. జడ్జి దంపతులు ఆలయంలోని శిల్పాలను తమ కెమెరాల్లో బంధించుకున్నారు. రామప్ప సరస్సును సందర్శించి బోటింగ్ చేశారు. వీరి వెంట తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరీ, హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్.రమేష్‌బాబు, వరంగల్ జిల్లా జడ్జి బీవీ.నిర్మల గీతంబా, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ కె.సునీల్‌కుమార్, ఎస్సై సతీష్, తహసీల్దార్ సదానందం, ఆర్ఐ రమేష్, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, కోర్టు సిబ్బంది, టూరిజం, దేవాదాయ, పురావస్తుశాఖల సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో విజేత రంగారెడ్డి

- మహిళా విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు
- ముగిసిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో అంతర్‌జిల్లాల బాల్‌బాడ్మింటన్ కమిటీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళా బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల విభాగంలో రంగారెడ్డి, మహిళా విభా గంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ట్రోఫీని అందుకొని విజేతగా నిలిచాయి. హనుమకొండ జేఎన్ స్టేడియంలోని బ్యా డ్మింటన్ కోర్టులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులుగా వివిధ జిల్లాకు చెందిన జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోరులో పురుషుల విభాగంలో రంగా రెడ్డి ప్రథమ స్థానం, హైదరాబాద్ ద్వితీయ స్థానం, ఆతిథ్య వరంగల్ తృతీ య స్థానం, మెదక్ చతుర్థ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు క్రీడాకారులు ప్రత్యర్థి జట్టుకు ముచ్చెమటలు పట్టించి గెలుపే లక్ష్యంగా ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తి, ప్రతిష్టలు కాపాడాయి. అదే విధంగా ఖమ్మం ద్వితీయ స్థానం, ఆదిలా బాద్ తృతీయ స్థానం, నల్లగొండ జట్టు చతుర్థ స్థానాల్లో నిలిచాయి.

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను, బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీర దృఢత్వంగా మారుతాం దన్నారు. రోజులో ఒక గంట పాటు వ్యాయామం తప్పకుండా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన క్రీడాభిమానులు వర్ధమానక్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహిం చడానికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు జేఎన్ఎస్‌లోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టు లో క్రీడాకారులు క్రీడా దుస్తులు మర్చుకునేందుకు వీలు కలిగిన గది నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టోర్నమెంట్ నిర్వహకుడు ఎస్వీ భద్రయ్య మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పురుషు ల, మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 10 మెన్, 9ఉమెన్ జట్లు పాల్గొన్నాయన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్ర ఉమెన్ జట్టు డిసెంబర్ 26నుంచి 30వరకు మహా రాష్ట్రలో నిర్వహించనున్న 70వ జాతీయస్థాయి ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అలాగే మెన్ విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్టు డిసెంబర్ 6నుంచి 9వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించనున్న 8వ ఫెడరేషన్ కప్ 2024కు మెన్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, టోర్నమెంట్ కమిటీ చైర్మన్ రవీంద్ర కుమార్, వైస్‌చైర్మన్ సాదుల ప్రకాష్, కన్వీనర్ కొత్తపల్లి ప్రసాద్, కోకన్వీనర్ గాదేపాక అయోధ్య, కమిటీ బాధ్యులు కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. ఈశ్వర్ కుమార్, కోచ్‌లు కొమ్ము రాజేందర్, విజయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు తిరుప తిరెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పురుషుల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచిన వరంగల్ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని ఆనాడు చెప్పిన నాయకులు 11 నెలలు అయినప్పటికీ పరిష్కరించలేదన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాంభిస్తామనడం సరికాదన్నారు. 317 జీవో ద్వారా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలన్నారు. కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేలు ఇవ్వాలన్నారు. మెడికల్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన ప్రయోజనాలను పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా సవరణ చేసి బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంజీవ, మురళీకృష్ణ, యాకూబ్, శ్రీనివాస్, హరినాయక్, కుమార్, రాజశేఖర్, ఇమామ్, సోమేశ్వర్, షబ్బీర్, రాంజీ, రాణి, మైసయ్య, నవీన, సాయికుమార్, తారకేశ్వర్, పెరుమయ్య, రవీందర్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జోనల్ క్రీడోత్సవాలు

పాల్గొననున్న 935 మంది క్రీడాకారులు



మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీసు చేస్తున్న విద్యార్థులు

ములుగు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 14 వరకు కాళేశ్వరం జోన్‌స్థాయి 10వ జోనల్ మీట్‌ను ములుగు జిల్లాలోని ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం మైదానంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని 11బాలుర గురుకులాలకు చెందిన 935 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారని వెల్లడించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, క్యారమ్స్ తదితర మొత్తం 9 కేటగిరీల్లో నాలుగు రోజులపాటు అండర్-14, 17, 19 పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆదివారం మైదానాన్ని, ఏర్పాట్లను కాళేశ్వరం జోనల్ అధికారి అరుణకుమారి, అధికారులు పరిశీ లించారు. ఆటల పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించిన ఐలాపురం గ్రామస్థులు

రోడ్డు, విద్యుత్ సమస్యలు తీర్చాలని డిమాండ్



ఎన్యుమరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కన్నాయిగూడెం గ్రామస్తులు

కన్నాయిగూడెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ గ్రామస్థులు సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించారు. 209 కుటుంబాలకు గానూ స్టిక్కరింగ్ చేసిన ఎన్యుమరేటర్లు 9వ తేదీ నుంచి సర్వే మొదలు పెట్టారు. మొదటి రోజు పది కుటుంబాల సమాచారం సేకరించగా, రెండోరోజు ఆదివారం 8 కుటుంబాల సమాచారాన్ని తీసుకున్నారు.

ఈక్రమంలో మిగతా గ్రామస్థులు తమ వివరాలను ఎన్యుమరేటర్లకు తెలిపేందుకు నిరాక రించారు. ఏళ్లతరబడి తమ ఊరికి రోడ్డు సౌకర్యం లేదని, వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమైన ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామంలో మౌలిక సౌకర్యాలను కల్పిస్తేనే సర్వేలో పాల్గొంటామని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఎన్యుమరేటర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ విషయమై కన్నాయిగూడెం ఎంపీడీవో అనిత స్పందించారు. ఐలాపూర్ గ్రామం రిజర్వ్ ఫారెస్టులో ఉండటంతో రోడ్డు నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అటవీ శాఖ అభ్యంతరాలు తెలుపుతోందని, దీంతో పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. పరిస్థితి ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందని వెల్లడించారు. సోమవారం గ్రామానికి వెళ్లి ప్రజలంతా కుటుంబ సర్వేలో పాల్గొనేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసి ఉన్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహాస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివచ్చారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, రమాసత్యనారాయణ స్వామిలను దర్శించు కున్నారు. కొండపై కొలువై ఉన్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, లక్ష్మీనర్సిం హస్వామిలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

అర్చకులు భక్తులకు దైవ దర్శనం గావించి తీర్థప్రసాదాలు అందజేసి స్వామి వారి చరిత్రను వివరించారు. కార్యక్రమంలో అర్చక ఉద్యోగులు పాల్గొ న్నారు. సుమారు 5వేల మంది భక్తులు స్వామి వారిని దర్శిం చుకున్నట్లు ఆలయ ఈవో సత్యనారాయణ వెల్లడించారు.



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

విజ్ఞానమే హద్దుగా..

- నిట్‌లో ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు
- ముగిసిన టెక్నోజియాన్ - 24 వేడుక
- రెండు రోజుల్లో 30కి పైగా ఎగ్జిబిట్ల ప్రదర్శన
- చివరి రోజూ కొనసాగిన పలు ఈవెంట్లు
- తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు

మెకానికల్ కిట్



మెకానికల్ కిట్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ ద్వారా నిర్వహించిన ఈ ఈవెంట్‌లో పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొనడం విశేషం. ఇది మెకానికల్ ఇంజనీరింగ్ ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకోవడానికి ఎంతగానో దోహదపడింది. వివిధ విడి భాగాలను ఒక దగ్గర చేర్చడం, కూర్చడం, వాటి వినియోగాన్ని అర్థం చేసుకోవడం ఈ ఈవెంట్ లక్ష్యం.

హనుమకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన టెక్నోజియాన్-24 ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమం సాయంత్రం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగింది. టెక్నోజియాన్‌లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ జాతీయ సాంకేతిక కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఇళ్లకు తిరుగు ముఖం పట్టారు. టెక్నోజియాన్ ద్వారా పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మూటగట్టుకొనివ తీపిగుర్తులతో మధుర జ్ఞాపకాలతో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. రెండు రోజుల పాటు విద్యార్థులతో కళకళాడిన నిట్ క్యాంపస్ తిరిగి నిశ్శబ్ద ఒడిలోకి జారుకున్నది.

కొనసాగిన ఈవెంట్లు

రెండో రోజు ఆదివారం కూడా పలు ఈవెంట్లు కొనసాగాయి. మొదటి రోజు చేపట్టిన ఈవెంట్లు రెండోరోజు ముగిశాయి. ఇందులో విజేతలైన వారికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఎప్పటికప్పుడు అందచేశారు. ఈవెంట్లు ముగిసిన తర్వాత వాటి ద్వారా తెలుసుకున్న కొత్త సాంకేతిక సమాచారాన్ని విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సమీక్షించుకోవడం కనిపించింది. ఈవెంట్లలో విద్యార్థులు కనబరిచిన ప్రతిభాపాటవాలను ఎప్పటికప్పుడు రికార్డు చేశారు.

భవిష్యత్తులో ఈ సమాచారం ప్రయోగాల కొనసాగింపునకు దోహదపడుతుందని ఈవెంట్ టీమ్ లీడర్లు అభిప్రాయపడ్డారు.

చిన్నారుల హల్‌చల్

టెక్నోజియాన్‌లో చిన్నారులు హల్‌చల్ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 30కిపైగా ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వీటన్నిటికీ వరంగల్‌లోని క్రియేటివ్ రోబోటిక్ ఇన్‌స్టిట్యూట్ సారథ్యం వహించారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తాము స్వయంగా రూపొందించిన పలు రోబోటిక్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. నిట్ విద్యార్థులను సైతం ఇవి ఆలోచింపచేశాయి. వీటిని టెక్నోజియాన్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



రివర్ క్లీనింగ్ బోట్

హనుమకొండ భట్టుపల్లిలోని ఎస్ ఆర్ స్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న మన్విత రివర్ క్లీనింగ్ బోట్ ను స్వయంగా రూపొందించింది. చెరువుల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని ఈ బోట్ ద్వారా శుభ్రం చేయవచ్చు.

వండర్ కాస్మిక్

దీనిని నిట్ క్యాంపస్‌లోని ఆస్ట్రానమీ క్లబ్ నిర్వహించింది. ఖగోళశాస్త్రం, గ్రహాల చలనం తదితర అంశాలను అర్థం చేసుకోవడానికి ఇది ఎంతో దోహదపడింది. వీటితో పాటు స్పాట్ లైట్ ఈవెంట్‌గా ఈగేమ్స్ కూడా నిర్వహించారు. ఈ ఈవెంట్ ద్వారా విద్యార్థులు పలు కంప్యూటర్ గేమ్‌లలో పాల్గొన్నారు. వాహనాల ప్రదర్శన రెండో రోజు కూడా కొనసాగింది.

లాబ్రింత్



లాబ్రింత్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఈ ఈవెంట్ రెండోరోజు కూడా కొనసాగింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ అమెచ్యూర్స్ హెచ్ఎఎం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో లేజర్ కిరణాలను తాకకుండా తప్పించుకుంటూ నిర్ణీత గమ్యస్థానానికి చేరుకోవడం ప్రధానం. ఇందులో విజేతలైన వారికి బహుమతులు ఉంటాయి.

కమాండ్ బేస్డ్ కంట్రోల్



పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ ఎగ్జిబిట్లలో కమాండ్ కంట్రోల్ బేస్డ్ రోబో విశేషంగా ఆకట్టుకున్నది. ఒక రోబోటిక్ జవాన్ బొమ్మను సెల్‌ఫోన్ ద్వారా బ్లూటూత్‌తో వాయిస్ ద్వారా నియంత్రించడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం ఈ ఎగ్జిబిట్ ప్రాథమిక దశలో ఉన్న భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తే పలు విధాలుగా ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు.

ప్రొడక్ట్ లాంచ్

మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో ఆయా ఉత్పత్తులను మార్కెట్‌లో ప్రవేశపెట్టడంలో చూపే నైపుణ్యాలను పరీక్షించారు. ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఉత్పత్తికి సంబంధించి సృజనాత్మకంగా ప్రకటనలు రూపొందించడం ట్యాగ్‌లైన్‌ను అభివృద్ధి చేయడం, ఉత్పత్తిని ఎలా ప్రారంభించాలో ప్రదర్శనతో మొదలైన అంశాలన్ని ఈ ఈవెంట్‌లో చూపారు.



ప్రొడక్ట్ లాంచింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు



సెల్యూషన్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సెల్యూషన్

టెక్నోజియాన్ చివరి రోజున నిర్వహించిన సెల్యూషన్ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో దాదాపు అన్ని విభాగాలకు చెందిన టికీలు, పాఠశాల విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు వ్యక్తిగతంగా పాల్గొనగా మరికొందరు బృందాలుగా పాలుపంచుకున్నారు. వివిధ అంశాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న జటిల సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశం.

రెండు రౌండ్లుగా దీనిని నిర్వహించారు. మొదటి రౌండ్‌లో సమస్యలతో కూడిన అంశంపై క్విజ్ నిర్వహించారు. రెండో రౌండ్‌లో సమస్యలకు పరిష్కారం చూపడం. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సాంకేతికపరమైన అపరిష్కృత సమస్యలను ఈ ఈవెంట్‌లో నివేదించారు. వీటిలో కొన్నిటికి పరిష్కారాలు చూపగా మిగతా వాటిని రికార్డు చేశారు. వీటిని ఇందుకు సంబంధించి ప్రస్తుతం పరిశోధనలు చేస్తున్న వారికి పంపుతారు.



చాకోలెట్ డిస్‌పెన్సర్

చాకోలెట్ డిస్‌పెన్సర్ ఎగ్జిబిట్ సందర్శకులను బాగా ఆకర్షించింది. రెండు బాక్స్‌లు ఉంటాయి. ఇందులో ఒకటి కాయిన్ బాక్స్ రెండోది చాక్లెట్లు ఉన్న పెట్టె. కాయిన్ బాక్స్‌లో నాణం వేస్తే రెండు పెట్టె నుంచి చాక్‌లెట్ బయటకు వస్తుంది.

టెక్నోజియాన్ పట్ల విదేశీయుల ఆసక్తి

తెలుగులో మాట్లాడుతున్న సిరియా బాలిక

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): టెక్నోజియాన్‌ను తిలకించేందుకు విదేశీయులు కూడా ఎంతో ఆసక్తి చూపారు. సిరియాకు చెందిన ముదార్.. తన ఇద్దరు పిల్లలతో టెక్నోజియాన్‌కు వచ్చారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ ఎగ్జిబిట్లను, ఇతర సైంటిఫిక్ ఎగ్జిబిట్లను తిలకించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. తన పిల్లలకు కూడా వాటి గురించి తెలియచెప్పాడు. ముదాన్ వరంగల్ నిట్‌లో సోలార్ థర్మల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండలోని ప్రశాంత్ నగర్‌లో ఉంటున్నారు. వరంగల్ నిట్‌కు జాతీయ స్థాయిలో మంచిపేరున్నందు వల్లే పీహెచ్‌డీ చేయడానికి దీనిని ఎంచుకున్నానని చెప్పారు. పీహెచ్‌డీ కోసం తాను దరఖాస్తు చేసుకోగా మూడు జాతీయ సాంకేతిక కళాశాలలో అడ్మిషన్ లభించిందని, వాటిలో వరంగల్ నిట్‌నే ఎంచుకున్నానని తెలిపారు. నిట్‌లో విద్యా బోధన, పరిశోధన ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని, క్యాంపస్ కూడా తనకు ఎంతో నచ్చిందని చెప్పారు. పీహెచ్‌డీ చేయడానికి అనువైన వాతావరణం ఇక్కడ ఉందని ప్రశంసలు కురిపించారు. ఏటా నిట్‌లో నిర్వహించే టెక్నోజియాన్ మిగతా నిట్, ఐఐటీలో కన్నా భిన్నంగా, ఉత్తమంగా ఉంటుందని పేర్కొన్నారు. తమ ఇద్దరు పిల్లలకు టెక్నోజియాన్‌లోని ఈవెంట్లు, ఎగ్జిబిట్లను చూపించేందుకు తీసుకువచ్చానని అన్నారు. కాగా, ముదాన్ ఇద్దరు పిల్లలు తెలుగులో మాట్లాడడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఇద్దరు పిల్లల్లో అమ్మాయి రాండ్ మొదటి తరగతి చదువుతున్నది. రాండ్ మాట్లాడుతూ.. కాజీపేటలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న తాను తెలుగులో మాట్లాడడం నేర్చుకున్నానని, తెలుగు సంప్రదాయం, సంస్కృతి ఇంటే ఎంతో ఇష్టమని ముద్దుముద్దుగా తెలిపింది.



టెక్నోజియాన్‌కు తన పిల్లలతో వచ్చిన సిరియా దేశస్థుడు ముదార్

నిట్‌లో విద్యార్థుల సంబురాలు



అలరించిన డీజే నైట్ ● చిందేసిన విద్యార్థులు

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన డీజే నైట్ ఆద్యంతం విద్యార్థులను ఉర్రూత లూగించింది. టెక్నోజియాన్-24 విజయవంతంగా ముగిసిన సందర్భంగా నిట్ క్యాంపస్‌లోని ఆడిటోరియం పార్కింగ్ స్థలంలో విద్యార్థులు డీజే నైట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీజే నైట్‌లో నిట్ విద్యార్థులు పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయే వరకు సాగిన ఈ సంగీత విభావరిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాటలు పాడి డ్యాన్సులు చేశారు. డీజే సౌండ్‌తో క్యాంపస్ ప్రతిధ్వనించింది. గతంలో టెక్నోజియాన్‌లో భాగంగా రాత్రి ప్రో షోలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే వారు. ఈసారి భిన్నంగా టెక్నోజియాన్‌లో పూర్తిగా ఈ ఈవెంట్ల పైనే దృష్టి సారించారు. ప్రో షోలు నిర్వహించలేదు. దీంతో ఆదివారం టెక్నోజియాన్ ముగియడంతో విద్యార్థులే డీజే నైట్ పేరుతో సంబరాలు జరుపుకున్నారు.



మిర్చి రైతులకు అండగా..

- 'నల్ల తామర' నివారణకు యువ శాస్త్రవేత్తల పరిశోధనలు
- విజయం సాధించిన మానుకోట జిల్లా వాసులు ప్రభాకర్, నరేంద్రకుమార్



త్రిప్ క్లియర్ గురించి నర్సారావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వివరిస్తున్న యువ శాస్త్రవేత్తలు (ఫైల్)



రాష్ట్ర ఐటీ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్ రంజన్ నుంచి ఉత్తమ స్టార్టప్ అవార్డు అందుకుంటున్న ప్రభాకర్, నరేంద్రకుమార్ (ఫైల్)

- వారి పరిశోధనలకు చేయూతనిస్తున్న ప్రభుత్వం
- రైతులకు తక్కువ ధరకు అందేలా 'త్రిప్ క్లియర్' రూపకల్పన

నెల్లికుదురు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మిర్చి, మామిడి పంటల్లో వ్యాప్తి చెందే నల్లతామర, ఇతర వైరస్‌లతో రైతులు తీవ్ర నష్టాలు మూటగట్టుకుంటున్నారు. అనేక రకాల క్రిమిసంహారక మందులను పిచికారీ చేసినా.. పలు యాజమాన్య చర్యలు చేపట్టినా ఫలితం లేక దిగాలు చెందుతున్నారు. అలాంటి రైతులకు అండగా ఉంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన డాక్టర్ గాజుల ప్రభాకర్ (పీహెచ్‌డీ ప్లాంట్ సైన్సెస్), డోర్నకల్ మండలానికి చెందిన డాక్టర్ పాపతోటి నరేంద్ర కుమార్ (పీహెచ్‌డీ మైక్రోబయాలజీ) ఉస్మానియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఈ యువ శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా అధ్యయనం చేస్తూ, పరిశోధనలే పరమావధిగా పెట్టుకొని రైతుల శ్రేయస్సు కోసం ఇప్పటి వరకు సుమారు 35 పరిశోధనలు చేసి విజయాలు సాధించి.. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. పేద రైతు కుటుంబాలకు చెందిన గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్ తమ తల్లిదండ్రులు పంట సాగులో పడుతున్న కష్టాలు, చీడపీడలతో నష్టపోతున్న తీరును చూసి చలించిపోయారు. తమ తల్లిదండ్రుల్లా రైతులు కష్టాలు పడొద్దని, నష్టాలు మూటగట్టుకోవద్దన్న లక్ష్యంతో ప్రభుత్వం సహకారంతో మరెన్నో పరిశోధనలు చేస్తూ రైతులకు అండగా ఉంటామని భరోసానిస్తున్నారు.

పలు అవార్డులు.. ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీలో బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ) నుంచి రూ.50 లక్షల గ్రాంట్, కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఐఎఫ్‌సీఐ (ఇండస్ట్రీయల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వెంచర్ క్యాపిటల్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా పరిశోధనలకు అందించే రూ.30 లక్షల ప్రాజెక్టుతో పాటు ఇటీవల రాష్ట్రప్రభుత్వం టీ స్పార్క్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ గ్రాంట్ రూ.10 లక్షలకు ఎంపికై గర్వకారణంగా నిలుస్తున్నారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొనే సమస్యల గురించి పరిశోధనలు చేసే స్టార్టప్ సదస్సులో పాల్గొనగా దేశనలుమూలల నుంచి వచ్చిన స్టార్టప్‌లలో తమ పేరులోని అక్షరాలు కలిసొచ్చేలా ఏర్పాటు చేసిన 'శ్రీజీపీ' అవెల్స్‌కు ఉత్తమ స్టార్టప్ అవార్డు దక్కింది. దీంతో పాటు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతిని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్ నుంచి అందుకున్నారు. రాష్ట్రప్రభుత్వం అందజేసిన నిధులతో ఉత్సాహంతో వివిధ రకాల ఆర్గానిక్ బయోపెస్టిసైడ్స్ ఉత్పత్తులను తయారు చేసి, రైతులకు అండగా ఉంటామంటున్నారు ప్రభాకర్, నరేంద్రకుమార్. కెమికల్ పెస్టిసైడ్‌ల వాడకం నిర్మూలించి బయోపెస్టిసైడ్స్ వాడటంతో ఆరోగ్య సమస్యలను అధికమించవచ్చని, అందుకు ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్‌లను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసే గ్రాంట్లతో పాటు 6 పుస్తకాలు ప్రచురించడంతో పాటు ఆరు పేటెంట్లను కూడా పొందామని వారు తెలిపారు.

సక్సెస్ స్టోరీ

రైతులకు తక్కువ ధరకే 'త్రిప్ క్లియర్'

నిరుపేద రైతుకుటుంబంలో జన్మించిన గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్ రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా చూశారు. అంతేకాదు కర్షకులు రసాయన ఎరువులు ఉపయోగించి పండించిన పంటల కారణంగా ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ బారిన పడుతుండటాన్ని గుర్తించారు. ముఖ్యంగా రైతులను పీల్చిపిప్పి చేసే మిర్చిలో నల్లతామర పురుగు నివారణ కోసం అగ్రిహబ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఐకేపీ-నాలెడ్జ్ పార్క్ హైదరాబాద్ సాయంతో ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ తయారీకి ఉపక్రమించి విజయం సాధించారు. తాము త్వరలో రైతులకు అందుబాటు ధరలో ఉండేలా 'త్రిప్ క్లియర్' అనే పేరుతో ఆర్గానిక్ బయో పెస్టిసైడ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు వారు చెబుతున్నారు.

ప్రభాకర్ ప్రస్థానం..



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి నిరుపేద కుటుంబానికి చెందిన గాజుల అంజయ్య-వెంకటమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా, మూడో సంతానంగా జన్మించిన ప్రభాకర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి వరకు చదివారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టేషన్ ఘన్‌పూర్‌లోని సోషల్ వేల్ఫేర్‌లో చదివి 2004లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్ సిటీ కళాశాలలో 2006-2009లో బీఎస్సీ (బీజడ్‌సీ) పూర్తి చేసి.. 2013 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎస్సీ (బాటనీ), 2013 నుంచి 2020 వరకు ప్రొఫెసర్ కె.శైలజ పర్యవేక్షణ పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఓయూలో నరేంద్రకుమార్ పీహెచ్‌డీ



డోర్నకల్ మండల కేంద్రానికి చెందిన పాపతోటి రంగారావు-శారద దంపతులకు నలుగురు సంతానం. అందులో మూడో సంతానమైన నరేంద్రకుమార్ డీడీహెచ్ఎస్‌లో (బిషప్ స్కూల్) 10వ తరగతి వరకు చదివారు. అనంతరం ఖమ్మంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. 2005-2007లో జేఎన్‌టీయూహెచ్ ఎం.ఎస్సీ (మైక్రోబయోలజీ) చదివారు. 2007 నుంచి 2018 వరకు హైదరాబాద్ ఉస్మానియ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అమీద పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

నిండు నూరేళ్ల బామ్మ..

- వందేళ్ల వయస్సుకు చేరువైన సాయమ్మ
- నేటికి ఆరోగ్యంతో ఉన్న వృద్ధురాలు



సాయమ్మ

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిండు నూరేళ్లు చల్లగా బతుకు అనే పదం చాలా మంది సందర్భాన్ని బట్టి వాడుతుంటారు.. కానీ అన్నేండ్లు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడమంటే మాట లు కాదు. రోజురోజుకు మానవ జీవన గడువు కల్తీ ఆహారం, బద్ధకం వల్ల నానాటికి తగ్గుతూ వస్తోంది. కానీ, ఓ బామ్మ సరిగ్గా వందేళ్లలో శనివారం అడుగుపెట్టింది. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామానికి చెందిన కారుకూరి సాయమ్మ. ఈమె భర్త రాజయ్య 35 ఏళ్ల కిందట మృతి చెందాడు. సాయమ్మకు కారుకూరి దుర్గయ్య, కారుకూరి పోషమల్లు అనే ఇద్దరు కుమారులు. కాగా, ఆమెకు ముని మనువళ్లు, మనువరాళ్ల బంధువులు మొత్తంగా 40 మంది రక్తసంబంధికులు ఉన్నారు. నేటికి సాయమ్మ మెత్తగా చేసిన అన్నాన్ని తింటుంది. ఎవరి సహాయం లేకుండా కూర్చుంటుండగా.. ఎవరైనా సహాయంగా పట్టుకుంటే నిల్చోని నడుస్తుంది. అయితే, సాయమ్మను చూసిన వారంతా ఆ రోజుల్లో తిన్న ఆహారం, చేసిన పనుల వల్లే ఇన్నేళ్లు జీవించడానికి కారణమంటూ చర్చించుకుంటున్నారు. ఆమెలో సగమైనా ఈ రోజుల్లో ఎవరైనా బతుకుతారో లేదోననే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

బైక్‌ల జోరు

- ప్రజా రవాణాలో ద్విచక్ర వాహనాలు టాప్
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వాటి సంఖ్య 5.73 లక్షలు

మట్టెవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ద్విచక్ర వాహనాల అమ్మకాలు వేగంగా దూసుకెళ్తున్నాయి. యువతీ, యువకులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు.. ఇలా అందరికీ ద్విచక్ర వాహనాలు అవసరం కావడంతో డిమాండ్ బాగా పెరిగింది. మధ్య తరగతి ప్రజలు, యువకులు, విద్యార్థులు కూడా వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లకు ప్రాధాన్యతనిస్తున్నారు. బ్యాంక్‌లు, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు ద్విచక్రవాహనాల కొనుగోళ్లకు రుణాలు ఇస్తుండడంతో కొనుగోలుదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నెలకు వేల సంఖ్యలో వాహనాలు అమ్ముడుపోతున్నాయని రవాణాశాఖ లెక్కలు చెపుతున్నాయి. ప్రస్తుతం సగటున నెలకు వరంగల్, హనుమకొండ రవాణాశాఖ కార్యాలయంలో వెయ్యికిపైగా వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. గ్రేటర్ పరిధిలో వాహన విక్రయాల్లో సింహభాగం ద్విచక్ర వాహనాలే ఉండడం విశేషం. కాగా, నగరంలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే వారి సంఖ్య 40 శాతానికి పైగా ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

హనుమకొండ జిల్లాలో 403 278, వరంగల్ జిల్లాలో 1,69, 555 ఉండగా, రెండు జిల్లాల్లో కలిపి 5,72,833 ఉన్నట్లు అధి కారులు తెలుపుతున్నారు.



యూత్‌జోష్

నగరంలో ఖరీదైన బైక్‌ల విక్రయాలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ధర కాదు.. స్టైలే ముఖ్యం.. అంటూ రూ.1 లక్ష నుంచి రూ.3లక్షల వరకు విలువైన బైక్‌లను యువకులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు రాయల్ ఎన్‌ఫీల్డ్, హ్యార్లి డేవిడ్‌సన్ బ్రాండ్‌లపై, స్పోర్ట్స్ బైక్‌లపై ఆదరణ చూపుతున్న యువకులు తాజాగా బీఎండబ్ల్యూ, డుకాటి బైక్‌లనే ఇష్టపడుతున్నారు. సంపన్న కుటుంబ యువకులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు స్పోర్ట్స్ బైక్‌లనే కొంటున్నారు.

ట్రాఫిక్ కష్టాలు

రోజు రోజుకూ ద్విచక్ర వాహనాల సంఖ్య పెరుగుతోంది. వరంగల్ జనాభాతో ద్విచక్ర వాహనాల సంఖ్య పోటీ పడుతోంది. ఫలితంగా నగరంలో ట్రాఫిక్ కష్టాలు కూడా మొదలయ్యాయి. వాహనాల సంఖ్య వేల నుంచి లక్షల్లోకి పెరిగినా రహదారుల విస్తరణ ఆ స్థాయిలో లేకపోవడంతో వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్, జేపీఎన్ రోడ్, ఎస్‌వీఎన్ రోడ్, ఆర్ఎస్‌టీ రోడ్, పోచమ్మ మైదాన్ జంక్షన్, నర్సంపేట రోడ్, ములుగురోడ్ జంక్షన్, హనుమకొండ తదితర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బయ్యారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల కలయిక బయ్యారంలో అపూర్వంగా కొనసాగింది. బయ్యారం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు విద్యనభ్యసించిన 1979-80 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులుఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమకు విద్యనేర్పిన గురువులు తిరుమల వెంకటరెడ్డి, వేములపల్లి సాంబశివరావు, పోటు నారాయణరావు, నాగిరెడ్డి సుబాష్ చంద్రబోస్, అట్లూరి చంద్రశేఖర్‌రావు, ఆర్వీ ప్రసాద్ రావును సన్మానించి, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం సన్మానగ్రహీతలు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం చదువు చెప్పిన తమను విద్యార్థులు గుర్తుపెట్టుకొని సన్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. అదే విధంగా ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పిలుచుకుంటూ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. జీవనశైలి, కుటుంబ సభ్యుల వివరాలు తదితర అంశాల్లో పాలు పంచుకుంటూ సరదా.. సరదాగా గడిపారు.

గూడూరులో అ'పూర్వ' వేడుక



2000-2001 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గూడూరు బాలుర ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్యాసంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనంను నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వీరబ్రహ్మాచారి, త్రిశూలం, వంచ రాజేందర్‌రెడ్డి, పొగాకు రాంచందర్, గట్టు రజిత, ప్రసాద్, స్వీపర్ సాంబయ్యలను పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతారం పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తమ తోటి స్నేహితులను ఆదుకోవాలని తీర్మాణించుకున్నారు. వచ్చే సంవత్సరం జరిగే సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాపాని శ్రీనివాస్, బానోత్ వెంకన్న, వీరవెల్లి మహేష్, నూనావత్ కృష్ణ, గుండెబోయిన మల్లేష్, మండల మల్లేష్, మేరుగు మధు, చాంద్‌పాషా, నరేష్, సులేమన్, సుధాకర్, శివ, నవీన్, దాసు, భట్టు సురేందర్, తిరుపతిరెడ్డి, వెంకన్న, అరుణ, హేమలత, మంజుల, రజిత, సావిత్రి, స్వప్న, అనిత, రమ, షాహిని తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో కవుల పాత్ర అనిర్వచనీయం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో కవుల పాత్ర అనిర్వచనీయమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో ఆదివారం కవి, రచయిత, సాహిత్య, సామాజిక విశ్లేషకులు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి రచించిన శంఖారావం కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి రచించిన శంఖారావం కవితా సంపుటి సమాజాన్ని చైతన్య పరిచే విధంగా ఉందని పేర్కొన్నారు. కవి, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ మాట్లాడుతూ శంఖారావం కవితా సంపుటిలో సృజనాత్మకత, భావావేశం, రమణీయమైన సాహితీ భావనలు ఉన్నాయని తెలిపారు. వైఎస్ఆర్ శర్మ మాట్లాడుతూ చెడుపై మంచి మంచిచేసే పోరాటానికి దిక్సూచీ శంకారావం అని కొనియాడారు. రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయి మాట్లాడుతూ నిరుద్యోగుల కష్టాలను కండ్లకు కట్టినట్టుగా ఈ కవితా సంపుటి ఉందన్నారు. సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి రెడ్డి, ప్రిన్సిపాల్ అప్పాల శ్రీనివాస్, గుర్రపు సత్యనారాయణ, వెంకటరెడ్డి, సోమేశ్వరచారి, సంకెపల్లి కీర్తనారెడ్డి పాల్గొన్నారు.



కవి, రచయిత సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి రచించిన శంఖరావం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నమురళీనాయక్

న్యూస్ బాక్స్

ఎస్సీ బాలికల గురుకులం పేరెంట్స్ అసోసియేషన్ ఎన్నిక



వెంకటేశ్ చైర్మన్

మరిపెడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రిన్సిపాల్ అరుణశ్రీ తెలిపారు. చైర్మన్‌గా ఎడెల్లి వెంకటేశ్, వైస్ చైర్మన్‌గా సైదులు, కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా మైబూబా, సహాయ కార్యదర్శిగా జిన్న లావణ్య, సలహాదారులుగా ఇల్లబెల్లి ఆనంద్, ఎలకపెల్లి రాంబాబు, అంజమ్మ, రమేశ్, మహేశ్, శ్రీరాములు ఎన్నికయ్యారు.

ఎంసీపీఐ మండల కన్వీనర్‌గా వెంకన్న



ఇనుగుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల ఎంసీపీఐ మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన బండారి వెంకన్నను నియమించినట్లు పార్టీ జిల్లా నాయకులు మర్రిపెల్లి మొగిళి, జాటోత్ బిచ్యానాయక్‌లు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడాలి'

మహబూబాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ రక్షణ కొరకు ప్రతి భారతీయుడు పాటుపడాలని విశ్వ హిందు పరిషత్ మానుకోట జిల్లా మీడియా ఇన్‌చార్జ్ గుండగాని దిలీప్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భారతదేశం మరోసారి చీలిపోకుండా ఉండాలంటే వక్ఫ్‌బోర్డును రద్దు చేసి ఖనిజ నియంత్రణ బిల్లును తీసుకురావాలని చెప్పారు. బంగ్లాదేశ్‌లో వలసలను అడ్డుకట్ట వేసి ఎక్కడ ఉన్న వారిని అక్కడే పునరావాసం కల్పించాలని చెప్పారు. గోమాతను జాతీయ జంతువుగా ప్రకటిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించాలన్నారు. హిందూ ధర్మ రక్షణ కొరకు ప్రతీ భారతీయుడు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లిం కమ్యూనిటీ హాలు నిర్మాణ కమిటీ ఎన్నిక



-కేసముద్రంలో ఏర్పాటైన కమ్యూనిటీ హాలు నిర్మాణ కమిటీ

కేసముద్రం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో ముస్లిం కమ్యూనిటీ హాలు (షాదీఖానా) నిర్మాణ కమిటీని ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షునిగా షేక్ మహ్మద్‌అలీ, ఉపాధ్యక్షులుగా యాకూబ్‌పాషా, షేక్ జాని, ప్రధాన కార్యదర్శిగా షేక్ జావెద్, కార్యదర్శి మహ్మద్ అల్లావుద్దిన్, సహాయ కార్యదర్శిగా మహ్మద్ తాజొద్దిన్, కోశాధికారిగా షేక్ అక్బర్, గౌరవ సలహాదారులుగా ఎండీ.జలాల్ షరీఫ్, ఎండీ.అమీరుద్దిన్, షేక్ ఖాదర్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గడువులోగా సమగ్ర సర్వే పూర్తి చేయాలి

● జడ్పీ సీఈవో పురుషోత్తం



నర్సింహులపేటలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న పురుషోత్తం

నర్సింహులపేట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర కుటుంబసర్వేను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం అన్నారు. ఆదివారం నర్సింహులపేట, రామన్నగూడెంలో పర్యటించి సమగ్ర కుటుంబసర్వేను పరిశీలించారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కులగణనను పారదర్శకంగా చేయాల్సిన బాధ్యత ఎన్యూమరేట్లపై ఉన్నదన్నారు. ఈ సర్వే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హు లకు అందించడానికి దోహదపడుతుందన్నారు. మండలస్థాయి అధికారులు సర్వేపై నిఘాపెట్టి ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా సర్వేపూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో కిన్నెర యాకయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

కుల గణన సర్వేపై అనుమానాలొద్దు

మరిపెడ : కుల గణన సర్వేపై ఎవ్వరికి ఎలాంటి అనుమానాలకు తావులేదని జడ్పీ సీఈవో పురుషోత్తం అన్నారు. ఆదివారం ఆయన సమగ్ర కుటుంబ కుల గణన సర్వేను మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని రాంవిలాస్ గల్లీలో పరిశీలించారు. అనంతరం అక్కడి కాలనీ వాసులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట స్థానిక తహసీల్దారు డి.సైదులు, ఎన్యూమనేటర్ మహేశ్ తదితరులు ఉన్నారు.

స్వీట్స్ అండ్ బేకరీ అసోసియేషన్ మానుకోట అధ్యక్షుడిగా శ్యాంసుందర్‌శర్మ



మహబూబాబాద్ టౌన్, నవంబరు 10 ఆంధ్రజ్యోతి) : స్వీట్స్ అండ్ బేకరీ అసోసియేషన్ మానుకోట అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ మార్వాడీ సత్రంలో ఆదివారం స్వీట్స్ అండ్ బేకరీ అసోసియేషన్ సభ్యులంతా సమావేశమై, నూతనంగా పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సలీం, ప్రధాన కార్యదర్శిగా శ్రీను (చిన్న), కోశాధికారిగా రాంపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భగాఅ నూతన అధ్యక్షుడు శ్యాంసుందర్‌శర్మ మాట్లాడుతూ స్వీట్స్ అండ్ బేకరీ షాపుల యాజమానులు ప్రతీ ఒక్కరు నాణ్యమైన స్వీటును వినియోగదారులకు అందించాలని సూచించారు. ప్రతిషాపు లైసెన్స్‌ను తీసుకోవాలని, అదే విధంగా బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని చెప్పారు. కాల పరిమితి అయిపోయిన వాటిని వెంటనే షాపుల్లో నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. నర్సింహారావు, సీహెచ్. రవికుమార్, లాదూరం మనీష్, ముఖేష్, ఉపేందర్, గంగాబిషన్, సురేష్, కల్యాణ్‌సింగ్, లెనిన్, నరేష్, బాలు, ఇబ్రహీం పాల్గొన్నారు.

వెలమ సంఘం కార్తీకమాస వన భోజన మహోత్సవం



బేతోలు మామిడి తోటలో వనభోజన కార్యక్రమానికి హాజరైన వెలమసంఘం జిల్లా నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు బేతోలు గ్రామంలోని కేశవరావు మామిడి తోటలో వెలమసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వెలమ కులస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కులబాంధవులంతా ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం ఆటలు, పాటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెలమ సంఘం ప్రతినిధులు తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, దార యాదగిరిరావు మాట్లాడుతూ.. వెలమ కులస్తులంతా కలిసికట్టుగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలన్నారు. మున్ముందు కూడ ప్రతియేట కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పొనుగోటి రామకృష్ణారావు, నల్లాని లక్ష్మణ్‌రావు, జిన్నారపు రాంచందర్‌రావు, పేరాల సంపత్‌రావు, ఎర్రబెల్లి శ్రీనివాసరావు, పేరాల సురేష్, గోనె శ్యాంరావు, బోయినపల్లి సతీష్, జిన్నారపు సోమేశ్వర్ పాల్గొన్నారు.

కన్నులపండువగా లక్ష మహాదీపోత్సవం



మానుకోట శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో లక్ష మహాదీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి పారిజాతం-రాజేశ్వర్‌రావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో లక్ష మహాదీపోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేసి, లక్ష కార్తీకమహాదీపోత్సవ పూజాకార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చకులు బ్రహ్మశ్రీ తాటిపాముల నర్సింహమూర్తి, ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు, కౌశిక్, దత్‌ల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష మహాదీపోత్సవ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనమాసం దీపం వెలిగించుట ద్వారా కోటి జన్మల పాపములు తొలగించుటయే కాక శ్రీమహాలక్ష్మీ అనుగ్రహం కలుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 6.01 గంటలకు మహాగణపతిపూజ, ఏకాదశ మహారుద్రాభిషేకం, శ్రీలక్ష్మీనారాయణస్వామి వ్రతం, లక్ష కార్తీక మహాదీపోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్టు బాధ్యులు మాలె పద్మావతి-నాగేశ్వర్‌రావు, మాలెసునిత-యోగీశ్వర్‌రావు, మాలె శివకుమారి-లక్ష్మణ్‌రావు, మాలె భవాని-శ్రవణ్‌కుమార్, పెనుగొండ కళ్యాణి- సమ్మారావు, పెనుగొండ నవ్యనళిన్‌కుమార్ పాల్గొన్నారు.



కొత్తగూడలో మాట్లాడుతున్న పూనెం ప్రభాకర్

మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

● సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)

కొత్తగూడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని, రైతులు పండించిన పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) కొత్తగూడ, గంగారం మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కొత్తగూడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పూనెం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తగూడలో వ్యవసాయ మార్కెట్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలు కురిస్తే చేతికందిన పంట తడిచి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వం కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తుంటే తక్కువ ధరకు వ్యాపారులకు, దళారులకు పంటను అమ్ముకుని నష్టపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్ నిర్మాణం కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కొత్తగూడ, గంగారం మండలాల సంయుక్త కార్యదర్శి ల్యాదల్ల రాజు, నాయకులు గొంది సమ్మన్న, కంగాల పాపన్న, రాజబోయిన రాజు, కొమ్మన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో మోసం చేశాడని యువతి మౌనపోరాటం

గార్ల నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రేమపేరుతో ఓ యువకుడు మోసం చేశాడని గార్లలో యువతి మౌన పోరాటానికి దిగింది. ఆదివారం బాధితురాలు తండ్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని, అదే ఊరికి చెందిన సురభి శ్రీకాంత్ ప్రేమించి, 8 నెలల కింద వివాహం చేసుకున్నాడు. ప్రేమపేరుతో మోసం చేసిన శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆరుసార్లు ఫిర్యాదు అందజేసినా పోలీసులు పట్టించుకోలేదని, దీంతో న్యాయం కోసం గార్ల మండలకేంద్రంలోని పోరాటం చేస్తున్నామని వివరించాడు. దీంతో పోలీసులు బాధితురాలుకు సర్దిచేప్పే ప్రయత్నం చేస్తు న్న సమయంలో, మీపై నమ్మకం పోయిందని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని యువతి తేల్చి చెప్పింది. ఈ క్రమంలో ఎస్సై జీనత్ కుమార్ బాధితుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో దీక్ష విరమించారు. ఈ విషయంపై ఎస్సైను వివరణ కోరగా.. ప్రేమపేరుతో మోసం చేసిన వ్యక్తిపై కనీసం ఫిర్యాదు ఇవ్వలేదని, ఇప్పటికైనా ఫిర్యాదు ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన వివరించాడు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

● తహసీల్దార్ సునీల్‌రెడ్డి

కురవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కులగణన సర్వేలో ఎన్యూమరేటర్లు తప్పులు దొర్లకుండా కచ్చితమైన సమాచారం పొందుపరచాలని తహసీల్దార్ సునీల్‌రెడ్డి అన్నారు. కురవి మండలం తులిస్యతండాలో కులగణన సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫారంలో పొందుపరిచిన ప్రశ్నలకు కుటుంబ యాజమాని నుంచి కచ్చితమైన సేకరించాలన్నారు. తహసీల్దార్ వెంట ఎంపీడీవో వీరబాబు ఉన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి

బయ్యారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 26 నుండి ఏడాది పాటు జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి పిలుపునిచ్చారు. బయ్యారంలో ఆదివారం ఆ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని బీజేపీ సర్కార్ మత విద్వేశాలను రెచ్చేగొట్టేలా పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ సందర్భంగా 2024-25 సభ్యత్వాలను ప్రారంభించిన ఆయన గ్రామ గ్రామాన శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, నాయకులు బందెళ కలింగరెడ్డి, గంగరబోయిన రాజు, మందనపు రాజు, బిచ్చ వీరన్న, కాంత్రి పాల్గొన్నారు.

గాంధీపురంలో కుక్కల దాడి

● 30 గొర్రెలు మృతి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రం శివారు గాంధీపురంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. దేవనబోయిన ఐలయ్యకు చెందిన గొర్రెలను ఇంటి ఆవరణలోని రాత్రి గొర్రెల కొట్టం (దొడ్డి)లో ఉంచి కుటుంబసభ్యులు రాత్రి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం తెల్లవారుజామున లేచి చూసేసరికి గొర్రెల కొట్టంలో ఉన్న గొర్రెలు, వాటి పిల్లలపై వీధి కుక్కలు దాడిచేశాయని, ఈ దాడిలోసుమారు 30 గొర్రెల వరకు మృతి చెందినట్లు బాధితుడు ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు వీటి విలువ రూ.2.50 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. వీధి కుక్కల నియంత్రణ కోసం మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'అభివృద్ధి కుంటుపడడానికి కేసీఆర్, కేటీఆర్ కారణం'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపాలిటీలో అభివృద్ధి కుంటుపడడానికి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ కారణమని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి ఆరోపించారు. 2023లో మాజీ సీఎం కేసీఆర్ పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు ఇస్తామని ప్రకటించి జీవో ఇచ్చి నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ మానుకోట పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం రెండవ రోజు నిరసన ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మానుకోట అభివృద్ధికి ఒక్కపైసె రాలేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, నాయకులు రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, కేదాసు రమేష్, మాలోతు రవీందర్, చిదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, తండా శ్రీనాథ్, మహేష్, వీరేందర్, నక్క నాగార్జున, బీదర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో హేమంత్‌కు రజతం

కేసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేరళలో ఈనెల 6 నుంచి 10 వరకు నిర్వహించిన జాతీయస్థాయి భారత స్పోర్ట్స్ అథారిటీ(ఎస్ఏఐ) రోయింగ్ (వాటర్ స్పోర్ట్స్) చాంపియన్‌షిప్‌లో కేసముద్రం స్టేషన్ కిష్టాపురానికి చెందిన నల్లగొండ హేమంత్ రజత పతకం సాధించినట్లు హైదరాబాద్ జేఎన్‌టీయూ పీడీ అశోక్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్ లయోల కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హేమంత్ గతంలో జాతీయస్థాయిలో రెండు బంగారు, ఒక వెండి, రజత పతకాలు, తాజాగా మరో రజత పతకం సాధించాడు. హేమంత్ జాతీయ స్థాయిలో పతకం సాధించడంపట్ల పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మేజర్ జీపీగా మార్చాలి : సీపీఐ

డోర్నకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపాలిటీని మేజర్‌గ్రామపంచాయతీగా మార్చాలని సీపీఐ జిల్లా సహా కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సీపీఐ డోర్నకల్ పట్టణ కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడారు డోర్నకల్ పట్టణాన్ని మునిసిపాలిటీగా మార్చడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ పనులు లేకపోవడంతో కూలీలు పనులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డోర్నకల్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చెందడం వల్ల ప్రజలు పన్నుల భారం పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి తురక రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొదిరిపాక ప్రబేష్, జె.స్వామి, బి.మల్లికార్జున్, రాంజీ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● జిల్లా కాంగ్రెస్ నేత యుగేందర్‌రెడ్డి



యుగేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మల్లికార్జునస్వామి ఆలయ నిర్వాహకులు

మరిపెడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్ రెడ్డి అన్నారు. పవిత్ర కార్తీక మాస సందర్భంగా ఆయన మరిపెడ బంగ్లాలోని భ్రమరాంబ-మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. చైర్మన్ కొంపెల్లి సురేందర్‌రెడ్డి, అనువంశిక చైర్మన్ గోలి శ్రీనివాస్, వైస్ చైర్మన్ అల్వాల ఉపేందర్, కార్యదర్శి దుబ్బాక లక్ష్మారెడ్డి, వల్లం వీరస్వామి, వీర భద్రం, వెంకన్న, మహేశ్, రమేశ్, బుచ్చిరామయ్య, వీరన్న, శివ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

చిన్నగూడూరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సమగ్ర సర్వేలో ఎలాంటి తప్పులులేకుండా వివరాలు నమోదు చేయాలని తొర్రూరు ఆర్డీవో గణేష్ ఎన్యూమరేటర్లకు సూచించారు. ఉగ్గంపల్లి ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేను ఆదివారం ఆయన పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేకు ఇంటి యాజమానులు అధికారులకు సహకరించి, వివరాలు అందించాలన్నారు. ఈ జాబితా ప్రక్రియను ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పూర్తి చేసేలా తహసీల్దార్ పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఆర్ఐ వెంకన్న, ఉపాధ్యాయురాలు అనూష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, శివమ్మ ఉన్నారు.

మిషన్ భగీరథ ట్యాంక్ లీక్

● పట్టించుకోని అధికారులు

చిన్నగూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లిలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయం ముందు ఉన్న మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ లీకై బెడ్‌కు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడంలేదని బీజేపీ రాష్ట్ర నాయకులు డీఎస్ వెంకన్ననాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటింటికీ తాగునీరు అందించడానికి 40వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మాణం చేసి ప్రారంభించి మూడేళ్ల గడవకముందే ట్యాంక్ లీకు, మెట్లు కూలిపోవడంతో పాటు పగుళ్లు ఏర్పడాయని అన్నారు. ట్యాంక్ పరిసరాలలో ఉన్న ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయాందోళనకు గురవుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, లీకేజీని అరికట్టి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దారమల్ల వెంకన్న, ఎడ్ల మల్లయ్య ఉన్నారు.


'గూడూరు సర్పంచ్ స్థానం బీఆర్ఎస్‌దే'

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రానున్న సర్పంచ్ ఎన్నికల్లో గూడూరు సర్పంచ్ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ గెలుపొందుతుందని మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ ధీమా వ్యక్తం చేశారు. గూడూరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టణాధ్యక్షుడు చీదురు వెంకన్న అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి 11 నెలలు కావోస్తున్నప్పటికి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల పెద్దఎత్తున వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేప్పుడు ఎందుకు హామీలు ఇచ్చారని ప్రశ్నించారు. సీనియర్ బీఆర్ఎస్ నాయకులు వాంకుడోతు కటార్‌సింగ్, రైతు కోఆర్డినేటర్ సంపంగి రాంచందర్, మాజీ టౌన్ అధ్యక్షుడు ఎదునూరి వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి భూక్య సురేష్‌నాయక్, బోడ ఎల్లయ్య అశోక్, రామన్న, సతీష్, వెంకన్న, యాదగిరి, రాంచందర్, రంజిత్ పాల్గొన్నారు.

నర్సింహులపేటలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

నర్సింహులపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నర్సింహులపేట మండలకేంద్రంతో పాటు, రామన్నగూడెంలోని పోలింగ్ కేంద్రాలను తొర్రూరు ఆర్డీవో గణేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడు ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో తప్పులు లేకుండా చూడాలని బీఎల్‌వోలను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ నాగరాజు, నాయబ్ తహసీల్దార్ సంజీవరావు, ఆర్ఐ అఖిల్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మానుకోట పట్టణాధ్యక్షుడిగా రవినాయక్



నెహ్రూసెంటర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మానుకోట పట్టణాధ్యక్షులుగా మూడ్ రవినాయక్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అంగోత్ చందులాల్‌నాయక్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన మూడ్ రవినాయక్ గత అనేక ఏళ్లుగా లంబాడీల కోసం జరిగే ఆత్మగౌరవ పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొంటున్నందున ఆయన సేవలను గుర్తించి మానుకోట పట్టణాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను వమ్ము చేయకుండ లంబాడీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ కార్యదర్శి గుగులోతు హరినాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ లక్ష్మణ్ నాయక్, జిల్లా, రాష్ట్ర నాయకులకు రవినాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజలను చైతన్యం చేయాలి'

డోర్నకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకు ప్రజలను చైతన్యవంతుల్నిచేసి పోరాటాలకు సంసిద్ధలను చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న అన్నారు. మండలంలోని తహసీల్దార్ బంజరలో నున్న పుల్లయ్య, మల్లిరెడ్డి ప్రతాపరెడ్డిల సంస్మరణ సభను శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడారు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన నాయకులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భూమికోసం.. భుక్తికోసం.. పీడీత ప్రజల విముక్తి కోసం ఎందరో తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని, వారి ఆశయ సాధనకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాందేని లక్ష్మణ్‌రావు, గుండు శ్రీను, దేవేందర్, హనుమయ్య, వీరన్న, ఎల్లయ్య, ముత్తయ్య, వినోద్, రామయ్య వెంకన్న, ఎల్లయ్యలు పాల్గొన్నారు.